

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 19 డిసెంబర్, 2022 సంచిక : 7

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
తెర ........ 5
అసూయ ........ 7
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 10
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 12
ఒకటి వశమైతే చాలు ........ 14
శాశ్వత ధర్మగోప్త ........ 15
సాయిభక్త దాసగణు ........ 18
అశ్రుతర్పణం-భేరి సోమన్నగారు . 21
మాతృసంస్థ కబుర్లు ........ 22
సాయిదత్త ప్రచారంలో........ 26
ఋభువు-నిదాఘుడు ........ 27
నీతి పద్యం, నీతి శ్లోకం ........ 30
దత్త మహాయాగము ........ 31

(ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.)







# మా వాణి



## ఆత్మ విచారం

శ్రీ సమర్థ సాయిదేవుల పాదపద్మాలకివే ప్రణామాలు.

సాధారణంగా సాయి సత్సంగాలలో పూజ, సాయి చరిత్ర పఠనం, దాని మీద చర్చగానీ, ప్రవచనంగానీ, కొంత భజన ఉంటాయి. వీటిలో పూజ, భజన - భక్తి మార్గానికీ, పఠన అధ్యయనాలు-జ్ఞాన మార్గానికి చెందినవి. ఆ స్వామి చెప్పిన రీతిలో సకల ప్రాణి సంసేవనం చేస్తూ జీవిం చడం కర్మయోగానికి చెందినట్టిది.

అయితే-వీటికన్నిటికీ మౌలికమై మనకు సత్ఫలితాలనివ్వగలిగే 'ఆత్మ విచారం' లేదా 'విచారణ'.

మామూలుగా ఎవరైనా ఉన్నత వ్యక్తులు ఏదైనా ప్రవచిస్తున్నప్పుడు-వింటున్న వాళ్లు 'ఇది నాకు అన్వయిస్తుందా? నేను వారు చెప్తున్న రీతిలో ఉన్నానా? ఆయా లోపాలు నాలో లేకుండా నేను చూచుకొంటున్నానా?" అని ఆలోచించుకోవాలి.

ముఖ్యంగా బాబావారి ఉపదేశాలు భక్తి, కర్మ, జ్ఞాన యోగాల మేలి మేళవింపుగా ఉంటాయి. మనకు ఆయన పట్ల ఉన్న గౌరవాభిమానాలను ప్రదర్శించేందుకు మనకున్న ఒకే ఒక్క మార్గం-ఆయన ఉపదేశాలను ఆచరించటమే.

సాయి సాటి వారిని నిందించవద్దన్నారు. కష్టానికి తగిన కూలి ఇమ్మ న్నారు. విషయభోగాలు ఏవి అనుభవిస్తున్నా మొదట భగవదర్పితం చేయ మన్నారు. నిద్ర, అలసత్వము వదలమన్నారు. సకల జీవులలోనూ తనను చూడమన్నారు.

మనం యివేమీ చేయకుండానే 'నేను సాయిభక్తుడ'ను అని ఎలా చెప్పకోగలం?

మనను లొంగదీసుకొని, స్వారీ చేసే దురలవాట్లు, బలహీనతలు కొన్ని ఉంటాయి. వాటిని క్రమంగా సాయికి అర్పించి చేతులు కడుక్కుంటూ ఉండాలి.

ఆ తండ్రి మన దగ్గరున్న మంచి మంచి వస్తువులు, గుణాలు ఏవీ అడగటం లేదు గదా! మనను నాశనం చేసే అవలక్షణాలేవైనా ఉంటే-వాటిని మాత్రమే తనకిమ్మంటున్నారు. అవి యిచ్చేస్తే మనం నిర్మలురం, పరిశుద్ధులం అవుతాము.

అప్పడాయన మనలో సుస్థిరంగా నెలకొని ఉండగలరు. బాహిరమైన దురలవాట్లు, మద్యసేవనం, పొగ త్రాగటం వంటివి యిలా వదులుకోవచ్చు. ఇవిగాక అంతర శత్రువులను జయించాలి గదా! దానికి ఆత్మవిచారం ఎంతగానో సహకరిస్తుంది.

సత్సంగాలలో పాల్గొన్నప్పడు - 'అక్కడ విన్నదానికి మనమెంత వరకు సరిపోతాం' అని ఆలోచించుకొంటూ ఉండాలి. నేను అంటే శరీరం కాదు-ఆత్మ, సత్యమైన నేను ఆత్మని, మాయా (భ్రమది). నేను శరీరం. అస్థిరమూ, సత్వరమూ అయినది. ఆత్మ ఒక్కటే శాశ్వతమైనదీ, సత్యమైనదీను. ఇది మనందరికీ తెలుసు.

ఈ ఆత్మ నిరంతరం ఆనందంలో మునిగిఉంటుంది. దాన్ని దుఖంలోకి లాగే ప్రయత్నాలు యీ కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు చేస్తుంటాయి. అంచేత క్షణక్షణం మనం యీ శత్రువులు మన లోపలికి ప్రవేశించి ఏం చేస్తున్నారో ఒక కంట కనిపెడుతూ ఉండాలి.

మన జీవన విధానాన్ని చిన్నచిన్న విభాగాలుగా చీల్చి ఆ పొరల మధ్య దాక్కొని యీ శత్రువులు ఎక్కడెక్కడున్నారో పరీక్షించుకోవాలి. అటుపైన వాటికి మూలకారణాలు వెదికి పట్టుకోవాలి. వాటిని సమూలంగా నాశనం





చేయాలి. అప్పడుగానీ వీళ్ళంతా నశించరు.

ఉదాహరణకు-కామం అంటే ఏవో రకరకాల కోరికలున్నాయను కొందాం. ఆ కోరికలు తీరకపోతే క్రోధం వస్తుంది. ఆ కోరిక తీరకుండా అడ్డుపడే వాళ్ళ మీదా, ఆ పరిస్థితుల మీదా విరుచుకుపడతాం.

ఒకవేళ మనకు దక్కకుండా ఆ వస్తువు మరొకరికి దక్కితే వారి పట్ల మాత్సర్యం. పొరపాటున మనకే దక్కితే దాన్ని దాచేసుకోవాలి, తనకే సొంతం చేసుకోవాలి-అన్న లోభం.


అటుపైన దాన్ని ఎన్నడూ విడువలేనంత మోహం. దాన్ని పొందిన అహం భావంతో మదం-ఇవన్నీ ఒకదాని వెనుక ఒకటిగా బయలుదేరి వచ్చేస్తాయి. దీనంతటికీ మూలకారణం ఏమిటి? కోరిక, కామం.

ఇంతకీ ఆ కామఫలాన్ని అనుభవించేదెవరు?-శరీరం.

దాన్ని పొందడానికి పడిన యాతనలు, ఆపైన అంటుకున్న అవ గుణాలు- వీటన్నిటి ఫలితం దుష్ట సంస్కార రూపంలో ముద్రపడేది ఎవరి మీద?-ఆత్మ మీద. అంటే అశాశ్వతమైన శరీరాన్ని తృప్తిపరచటం కోసం-శాశ్వతమైన ఆత్మను మురికిచేసుకొంటున్నాం.

మరో రకంగా చెప్పాలంటే-మాయ 'నేను' మీది భ్రమతో నిజమైన 'నేను'కి ద్రోహం చేసుకుంటున్నాం. తత్ఫలితంగా పై జన్మలోని జీవితాన్ని కూడా చేదు చేసుకున్న వాళ్ళమవుతున్నాం (ఈ జన్మలోని కర్మల ద్వారా ఏర్పడిన మంచి చెడుల సంస్కారాల ఫలమంతా వచ్చే జన్మలో అనుభవించక తప్పదని శాస్త్రాలు నిష్కర్షగా చెప్తున్నాయి). ఇలా ఆలోచించుకోవటమే ఆత్మ విచారం.

అందుచేత ఇకపైన మనలో ప్రతి ఒక్కరం మన చెవినబడిన ప్రతి మంచి వాక్యాన్ని విశ్లేషించి అర్థం చేసుకొని, మన జీవితం తదనుగుణంగా ఉందో లేదో సరిచూచుకొని, ఆత్మ విచారంతో స్వచ్ఛ సంస్కారాలనే పెంచుకొనే ప్రయత్నం చేద్దాం.



# తెర

- 'రమణాశ్రమ లేఖలు' నుండి

నిన్న మధ్యాహ్నం ఒక భక్తుడు భగవానుని సమీపించి "స్వామీ! తన్ను తానెరిగిన వారికి జాగ్రత్స్వప్న సుషుప్తులనే మూడవస్థలూ ఉండవంటారే నిజమేనా?" అన్నాడు.

భగవాన్ ప్రసన్న దృష్టితో చూస్తూ ....

"ఉండవంటే ఏమని మీ భావం? 'నాకు స్వప్నం వచ్చింది; నాకు గాఢంగా నిద్ర పట్టింది; నాకు మెలకువ వచ్చింది' అని అంటూ ఉండటం వల్ల ఈ మూడవస్థలలోనూ నీవు ఉన్నట్లు ఒప్పుకోక తప్పదు గదా. అందువల్ల నీవు ఎప్పుడూ ఉన్నావన్నది స్థిరపడుతూనే ఉన్నది.

ఉన్నట్లే ఉంటే, జాగ్రదవస్థ వస్తుంది. అది మరుగై స్వప్నం వస్తుంది. అదీ పోయి సుషుప్తి వస్తుంది. నీవు అప్పుడూ వున్నావు, ఇప్పుడూ వున్నావు, ఎప్పుడూ వున్నావు.

పై మూడవస్థలూ వచ్చేవీ పోయేవీను. నీవే ఎప్పుడూ ఉంటావు. అది ఎట్లాగంటే సినిమా దృశ్యం వలెనే. తెర ఎప్పుడూ ఉంటుంది. రకరకాల బొమ్మలు వస్తవీ, పోతవి. తెరకు ఒక్కటీ అంటదు. తెర తెరగానే ఉంటుంది.

అదే విధంగా నీవు నీవుగానే ఉంటావు. అది తెలుసుకుంటే అవస్థలు తెర మీద బొమ్మల వలెనే నిన్నేమీ బాధించవు... అంటే నీకు అంటవన్న మాట.

సినిమా తెర మీద ఒకప్పుడు అంతులేని అలలతో సముద్రం గోచరిస్తుంది, పోతుంది. మరొకప్పుడు గప్పున మండుతూ అగ్ని కనిపిస్తుంది; అదీ పోతుంది. అప్పుడూ తెర ఉన్నది, ఇప్పుడూ తెర ఉన్నది.





ఆ తెర ఆ నీటి వల్ల తడిసిందా? ఈ అగ్ని వల్ల కాలిందా? ఏదీ దాని కంటలేదు.

అదే విధంగా జాగ్రత్స్వప్న సుషుప్తులలో కలిగే కల్లోలాలేవీ నిన్నంటవు. నీవు నీవుగానే ఉంటావు" అని సెలవిచ్చారు.

"అయితే, మూడవస్థలూ ఉన్నా వారికేమీ అంటవన్నమాట.... అంతేనా?" అన్నారా పృచ్ఛకులు.

"అదే అదే. ఇవన్నీ వస్తవి. పోతవి. వారికేమి? వారికెప్పుడూ ఒక్కటే అవస్థ" అన్నారు భగవాన్.

"అంటే అన్నిటికీ సాక్షి మాత్రంగా ఉంటారనే గదా అర్థం" అన్నారా భక్తులు.


"అదేనండీ, దీనికే పంచదశి దశమ ప్రకరణంలో విద్యారణ్యుల వారు నాటకదీపం ఉపమానంగా చెప్పారు. నాటకం ఆడుతూ ఉంటారు. దీపం దానికి సాక్షి. అది రాజ, సేవక, నర్తకీ విభేదంలో హెచ్చుతగ్గులు లేకుండా రంగస్థలంలో నటించే నటకుల మీద, ప్రేక్షకుల మీద ఒకే విధంగా ప్రసరించి ప్రకాశింపజేస్తుంది.

ఆ దీపం రంగానికి ముందూ ఉంటుంది, రంగం నడుస్తున్నప్పుడూ ఉంటుంది, రంగం ముగిసిన తర్వాత ఉంటుంది.

అదే విధంగా సాక్షిన్ని వృద్ధిక్షయాది వికారాలు లేకుండా అహంకారాన్నీ, బుద్ధినీ, శబ్దస్పర్శలనూ, విషయాదులనూ ప్రకాశింపజేస్తూ ఉంటాడు.

సుషుప్త్యాద్యవస్థలలో అహంకారాదులు లేనప్పటి ఆ సాక్షి నిర్వికారుడై స్వయంగా ప్రకాశిస్తూనే ఉంటాడు అని తాత్పర్యం. ఏదైనా ఒకటే.

తానెవరో తన ఉనికి యేదో విచారించి తెలుసుకుంటే సందేహాలే ఉండవు" అని సెలవిచ్చారు భగవాన్.



# అసూయ

- శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

ఒక మహావృక్షము కలదు. అది శాఖోపశాఖలుగా విస్తరించి ఫల పుష్ప సమన్వితమై కళకళలాడుచు, చూపరులకు పరమానందం గొల్పు చుండెను. ఆకస్మాత్తుగా ఒక దినమున అది శుష్కించిపోయెను, కారణం ఎవరికినీ బోధపడకుండెను.

సర్వాంగ సుందరమై విలసిల్లు ఆ వృక్ష రాజమున కట్టి దీనదశ ఏల సంభవించెనో జనులకు విదితము కాలేదు. అత్తరి యొక వృక్ష శాస్త్రజ్ఞుడు అచటికేతెంచి యా పాదమును చక్కగ పరీక్షించి, దాని జీర్ణదశకు కారణ మరసెను. ఒక వేరు పురుగు లోన ప్రవేశించి, ఆ చెట్టును లోపల లోపలనే గుల్ల చేసి వైచెను. అది అసలు సంగతి.

అట్లే కొందరు వ్యవహార రంగమునకు, మరికొందరు పరమార్థ క్షేత్రమునకు తమ ప్రయత్నాతిశయముచే మహోన్నత స్థితిని చేపట్టినను, గొప్ప స్థానమలంకరించినను, ఆకస్మాత్తుగా పతనమైపోవుచున్నారు. దీనికి కారణమేమి?

వారిలో ఒక వేరు పురుగు ప్రవేశించుచున్నది. అదియే అసూయ. అది ప్రవేశించి వారిలోనున్న సద్గుణరాశి నంతను బూడిదపాలు చేసి వైచుచున్నది. అప్పుడు మానవుడు దానవుడుగా రూపొందుచున్నాడు. కాబట్టి ముముక్షువులీ పరమశత్రు విషయమై కడు జాగరూకులై మెలంగి అద్దానినెన్నడును దరికి జేరనీయక చూచుచుండవలెను.

జనులలో మూడు తరగతుల వారు కలరు. కొందరు పరుల ఔన్నత్యమునకు కారకులై, వారు వృద్ధినొందుటను జూచి పరమానంద





పడుచుందురు-వీరు ఉత్తమ తరగతి వారు. మరికొందరు ఇతరుల అభివృద్ధికి ఏ మాత్రం సహాయము చేయక తమ అభివృద్ధిని మాత్రం చూచుకొనుచుందురు - వీరు మధ్యమ తరగతి వారు. వీరివలన పరులకు ఉపకారం లేకపోయినను, అపకారం కూడ లేదు. కావున ఒక విధంగా మంచివారే యగుదురు.

ఇక మూడవ తరగతి వారు తాము ఉన్నతిని పొందక పోయినను ఒకరి ఔన్నత్యమును జూచి ఓర్వలేరు - వీరు అధములు. అట్టి అసూయా పరుల వలన సంఘమునకు తీరని కళంకం సంభవించుచుండును. ఇది చాలా హేయమైన ప్రవర్తన. అసూయాగ్రస్తుని బాధకు వేరు కారణ మేమియు ఉండదు. ఒకరు బాగుపడుటయే అతని ఏడుపుకు కారణం.

దుర్గుణములన్నిటిలోను ఈ అసూయా మహా ప్రమాదకరమైనది. శ్రీకృష్ణ భగవానుడు -

1. ఇదంతుతే గుహ్యతమం ప్రవక్ష్యామ్య నసూయవే.
2. న చాశుశ్రూషవే వాచ్యం నచమాం యో2భ్యసూయతి.

అని గీతయందు వచించినవాడై అసూయాపరులకు పవిత్రమైన శాస్త్రమును బోధించినను నిరుపయోగమగునని సూచించెను. అసూయ అనునది ఒక విధమైన కల్లు. అది త్రాగిన వారికి మంచి, చెడ్డ తెలియదు. సర్వభూతములందు వెలుగుచున్న పరమాత్మను వారు గ్రహించజాలరు. పరుల సుఖమును జూచి ఓర్వలేకుందురు.

పాత్ర మంచిది, పప్పు మంచిది, చింతపండు మంచిది, నీళ్ళు మంచివి, నిప్పు మంచిది, వండినవారు దక్షులు; అయినను వండిన పప్పు, పులుసును త్రాగి అందరును వాంతి చేసుకొనిరి. కారణమేమి?

ఆ పాత్రకు లోన కళాయి లేదు. అదే విధంగా ఎన్ని సుగుణములున్నను

ఒక్క అసూయయను దుర్గుణమున్నచో ఆ వ్యక్తి లోకమునందు పతనమై పోవును. భగవద్రష్టయందు అతడు క్రమంగా తన పూర్వపు టౌన్నత్యమును గోల్పోవుచుండును.

ఇక, అసూయకు కారణమేమియో విచారించెదము. అజ్ఞానమే దానికి కారణము. ఎదుటివారు, తాము వేరువేరని తలంచుటయే ఆ దుర్గుణమునకు హేతువు. సర్వులయందును ఒకే భగవత్స్వరూపము వెలుగుచున్నదని తెలిసినపుడు, తన ఆత్మయే సర్వభూతాత్మయని గ్రహించినపుడు ఇక పరులను ఏల హింసించును? పరుల అభివృద్ధిని జూచి ఏల దిగులు నొందుచుండును?

యస్మిన్సర్వాణి భూతాని ఆత్మైవా భూద్విజానతః

త్రతకో మోహః కః శోక ఏకత్వ మనుపశ్యతః

అను ఈశావాస్యోపనిన్మంత్రమీ సత్యమునే వెల్లడించుచున్నది. “ఓ జీవులారా! సమస్త ప్రాణికోట్ల యందును మీ హృదయాంతర్వర్తి యగు ఆత్మయే విరాజిల్లుచున్నదని తెలుసుకొన్నపుడిక కామముగాని, క్రోధము గాని, శోకము గాని, అసూయ గాని ఏల కలుగగలదు?” అని ఆ ఉపనిషత్తు జనులను నిలదీసి అడుగుచున్నది.

కాబట్టి సర్వాత్మ భావమును చక్కగా అలవరచుకొని సర్వత్ర ఏకత్వానుభవము గలవారై జనులు తమ యందలి ఈ అసూయాది పరమ శత్రువులను పారద్రోలి జీవితమును నిష్కంటకముగ, శాంతిమయముగ, పరమానంద ప్రదముగ నొనర్చుకొందురు గాక!





సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

మర్ఘుథార్ సడిపొచా పహి ఱువపహనా రెచి
హై ఏక్ సహరా తేరా మేరా నహీ జగ్ మే కోయి
తూ బస్‌కే సకామీ సాయిజీ మోహీ పార్ కియాకరనా ॥ సా ॥
కిత్ ద్వార్ తేరా త్యజకే రాజేశ్వర్ జాఊఁమై
ఫరియాద్ కిసే అపనీ రో రోకే సువా ఊఁమై
ఆవాజ్ మేరీ సున్‌కే పహచాన్ లియా కరనా ॥ సా ॥

## సురకీ గతి మై క్యా జానూ?

సురకీ గతి మై క్యా జానూ? ఏక్ భజన్ కరనా జానూ?
అర్థ భజన కీభీ అతి గహరా, ఉసకో భీ మై క్యా జానూ?
ప్రభు ప్రభు ప్రభు కరనా జానూ, సాయి, సాయి, సాయి కరనా జానూ?
బాబా, బాబా, బాబా కర నా జానూ, నైనా జల భర నాజానూ
గుణ గాయే ప్రభు ఆంఖ్‌న ఖోలే
గుణ గాయే సాయి ఆంఖ్‌న ఖోలే
గుణ గాయే బాబా ఆంఖ్‌న ఖోలే
ఫిర్ క్యోం తుమ గుణ గాతే హెూ!
మై భోలా మైం ప్రేమ్ దివానా
ఇతనీ బాతే క్యా జానూ!
ప్రభు ప్రభు ప్రభు కరనా జానూ, సాయి సాయి సాయి కరనా జానూ?
బాబా, బాబా, బాబా కర నా జానూ, నైనా జల భర నాజానూ

## త్రేతాయుగ మే రామ్, ద్వాపరమే శ్రీకృష్ణ

త్రేతాయుగ మే రామ్, ద్వాపరమే శ్రీకృష్ణ
కలియుగ మే సాయినాథ్ దునియా మే ఆయే
షిరిడీ వాలే సాయిబాబా దరస్ దిఖానా
సాయినాథ్ బాబా ముఝొ దరస్ దాఖానరే! దరస్ దిఖానా ॥త్రే॥
జగ మాయాకే జాల్ మేం ఫస్ కే!
తుఝొ భూల్ గయా ప్రభు ముఝొ క్షమా కరనా!
కరుణా సాగర్ తుమ్‌హెూ ముఝొ మాఫ్ కరనా!
ముఝొ మాఫ్ కరనా
సంసార సాగర్‌మే దూబ్ రహీ నైయ్యా!
తుమ బిన మేరా కౌన్ ఖివైయ్యా
జోబీదేనా దేదే ముఝొ ఝోలీ ఫసాలీ రే
ఝోలీ ఫసాలీ రే!
భక్తోం కో రఖనే వాలే కలియుగమే ఆయే
దునియా కా కష్ట మిటానే మేరే బాబా ఆయే
ఆవో మేరే బాయి బహనోం ప్రభు కో పుకారో!
బాబా కో పుకారో

### బాబా బాబా బాబా మేరే

ఆయా శరణు తుమ్హారే బాబా బాబా మేరే!
దేదో దర్శన్ నా తరసావో, భటక రహోహుం ద్వారే ద్వారే
కాశీ, మథురా ... అయోధ్య యహీ
పావన చరణోం కా దర్శన యహీం
శీష్ నవావో ఇన్ రణోం మే బోలే బాబా మేరే
మై అబ్ నహీం జావూంగా కహీం!

(సశేషం)





## శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము
## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**
(గత సంచిక తరువాయి)

### 16. వయసునందు నీవు భక్తి గలిగియున్న

ఆ.వె. నదిని దాటనగును నావికు నమ్మిన
నమ్మి గొలువ-తానె నావ యగుచు
సద్గురుండు నిన్ను సంసార జలనిధి
దాటజేయుసెగలు దగులనీక. 1

తే.గీ. జనన మరణాల దిరిగెడు చక్రమాపి
త్రుంచి ప్రారబ్ధకర్మలు తృటిన నీదు
మోక్షమమరంగ మార్గంబు బొందు బరచు
భక్తి శ్రద్ధల గొలువంగ-బాబ సాయి. 2

ఆ.వె. సాధనంబులందు సాయిస్మరణయేను
సరళ మార్గమగును సంస్మృతించ
యిహము నందు నీదు యిక్కట్లు దొలగించి
పరము బడయగాను బాట జూపు. 3

ఆ.వె. వయసు నందు నీవు భక్తి గలిగియున్న
ముదిమి నందు నీకు ముప్పు రాదు

భక్తిభావ మలర బడయుదు జ్ఞానంబు
తద్విరాగి కగును దారి సుఖము. 4

ఆ.వె. స్వార్థరహితు డితడు, శాంత స్వరూపుడు
బ్రహ్మ తేజ మలరు బాబసాయి
కీర్తికాంచనముల కిష్ట పడనివాడు
భక్తజనుల కితడు పరమశివుడు. 5

ఆ.వె. ఆరడుగుల సాయి అరచేతి బల్లపై
నెటుల నిదురపోయె నెవరికెఱుక
అష్టసిద్ధులున్న ఆత్మజ్ఞుడౌసాయి
భక్తి భావ మలరపట్టుమతని. 6

ఆ.వె. పరమ దివ్యతేజు భక్తసులభుసాయి
సత్యశీలవంతు సాధుజనుని
భక్తి గొలువలేని బ్రతుకది వ్యర్థంబు
భక్తి గొలుచు వారి భాగ్యమమరు. 7

ఆ.వె. సంతరామదాసు సంరక్షణముజేసె
హిందువైరి జనుల హింస నుండి
సాయిబాబ వచ్చి సంయమనముజేసె
మతములనిన యొకటె మతము సాయి. 8

ఆ.వె. నియత గురువు వేరనియత గురువువేరు
భక్తి పథముజూపి భవము దీర్చు
గురుని గొలువ వలయు గురియైన భక్తితో
గురువు లందు గొప్ప గురుడు సాయి. 9





ఆ.వె. ఈశ్వరు కృపగల్గి యీజన్మమందున
సాయినాథుభక్తి సాధ్యమయ్యె
సాయి కథలు వినుచు సాధన జేయుచు
మనన భక్తి యుతుల మార్గమొంద. 10

ఆ.వె. పాపులు మునుగంగ పాపాలు కూడగా
పుణ్యనదులు కూడ పుణ్య పురుష
పాదధూళి కొఱకు పరితపించుచునుండు
సాయి పదము బట్టి సాగు పథము. 11

తే.గీ. గద్దె దిగమన్న నానాను గదుమకుండ
గద్దె దిగిన వినయశీలి కరుణసాయి
నీకు దాసాను దాసుడ నీదు సేవ
జేతుననుసాయి వసియించు భక్త హృదిన. 12

**(సశేషం)**

## ఒకటి వశమైతే చాలు!

మోక్ష ద్వారమునకు శమము (శాంతము), విచారణ, సంతోషము, సాధు జన సాంగత్యము అను నలుగురు ద్వారపాలకురు గలరని చెప్పబడ్డది.

ఈ నాల్గింటిని లేదా శక్తి లేనిచో మూడింటిని, లేక రెండింటిని ప్రయత్న పూర్వకంగా సంపాదించవలెను. ఏలయనగా -

ఇయ్యని మోక్షమను రాజు యొక్క గృహ ద్వారమును తెరచును. పై నాలుగు సాధనములలో ఒక్కదానినైనను ప్రాణములకు తెగించియైనను సర్వప్రయత్నములచే సాధించవలెను. ఏలనన -

అందొక్కటి వశపడినచో తక్కిన మూడున్ను వశమగును. వానిని సంపాదించనంతవరకు మనుజుడైనను, దేవతయైనను, యక్షుడైనను- ఎవడైనను సరే సంసార తరణమున అతనికి వేరొక ఉపాయం లేదు.

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

'అక్కా! శైబ్యా! నీవే ఈ పదహారు వేల మంది దీనురాండ్రను ఆదుకోవాలమ్మా. నీవే వాళ్లకు ఒక దారి చూపాలి' అని ఆర్ద్రంగా సత్య శైబ్యను కౌగిలించుకొని, కన్నీరు కార్చింది. 'ఎన్ని బాధలకోర్చారమ్మా వాళ్ళు. ఆ చితికిన బ్రతుకులు కృష్ణస్వామి అమృత వాగ్వేచనంతో తిరిగి భక్తిని చిగురింపజేయాలి'. శైబ్య కన్నుల్లో ఒక నూతన ప్రయోజనం జీవనానికి లభించినట్లు వెలుగు కన్పించింది.

కృష్ణుడు మరునాడు యజ్ఞంలో పాల్గొన్నాడు. గర్గాచార్యుల వారు ఆ పరమపురుషుని ద్వారానే పూర్ణాహుతులు వేల్పించారు. సరసన రుక్మిణి, ప్రక్కనే సత్యభామ ఉన్నది.

పూర్ణాహుతులైన తరువాత శ్రీకృష్ణుడు, మండపంలోని వరిష్ఠ వ్యక్తులకు, యాదవ ప్రముఖులకు ఆబాల గోపాలానికి సాధువాదాలు పలికాడు. ఎదురుగా ఒకవైపున క్రిక్కిరిసి ప్రాణాలు కండ్లలో నిలుపుకొని, ఆర్తితో, ప్రేమతో, ఆర్ద్రమైన గుండెలతో పదహారు వేలమంది నరకుని చెర నుండి ముక్తలైన ఆ స్త్రీలు శ్రీకృష్ణుని, ఆ నీల మేఘశ్యాముని, జగదుద్ధర్తను, రెప్పలార్చకుండా చూస్తున్నారు. ఆయన రూపవైభవాన్ని కనులలో గుండెలలో, జీవన సర్వస్వంలో నింపుకుంటున్నారు. ఒక్కసారిగా వారి గొంతులు విచ్చుకున్నాయి. ఆకాశపు కవాటాలు తెరుచుకొని సర్వలోకాలు ఒక్కసారి గొంతెత్తి పాడినట్లు

"హే కృష్ణ! గోవింద ! హరే మురారే
హే నాథ! నారాయణ! వాసుదేవ"





గర్గాచార్యుల వారు లేచి నిల్చుని చేయెత్తి, తర్జనితో అందరినీ శాంతించమని కోరారు. సభ సద్దుమణిగింది.

శ్రీకృష్ణుని గొంతు సమ్మోహకంగా వినిపించింది.

'మహర్షి గణానికి, తాపసులకు, శ్రోత్రియులకు, సర్వ యాదవాది ప్రజారూప పరమేశ్వరులకు నమస్సు లర్పిస్తున్నాను. లోకంలో ధర్మస్థాపనకు, శీల రక్షణకు, స్త్రీ పావిత్ర్య పరిపోషణకు ఒక్కొక్క అనితర చర్య తీసుకోవలసి వస్తుంది. నరకాసుర వధను గురించి మీరు వినే ఉంటారు. అతడు చేయని పాపం లేదు. గ్రామాల మీద, నగరాల మీద పడి సర్వనాశనాన్ని రచించాడు. పదహారు వేల ఒక వందమంది మన తోటి వారి ఇండ్ల నుండి స్త్రీలను అపహరించి, బందీలుగా, కట్టు బానిసలుగా చేసుకొని దాదాపు ఇరవై ఏండ్ల నుండి భీభత్సంగా ప్రవర్తించాడు. ఇప్పుడు వాళ్లందరూ విముక్తలైనారు. కానీ, లోకాపవాదభీతివల్లా, కుటుంబాల మానమర్యాదలు పోతవేమోనన్న భయంతో, తిరిగి వచ్చిన వారి ప్రవర్తన, భవిష్యత్తూ భద్రంగా ఉంటవో, ఉండవోననే భయంతో ఎవ్వరూ తమ ఇంటి ఆడబిడ్డలను తిరిగి తీసుకొనిపోవడానికి రాలేదు. వారి గతి ఏమి కావాలి? వారినెవరు ఆదుకోవాలి. సమాజంలోని దుష్టప్రవృత్తుల నుండి వారికి రక్షణ చేకూర్చే దెవరు?'

సభలోని అందరి కన్నులు చెమ్మగిల్లాయి. గొంతులు మూగబోయాయి. ఉపమన్యుల వారు లేచి, 'కృష్ణా! నీవే వారికి రక్షణ చేకూర్చాలి. మరెవరూ సాహసం చేయగలరయ్యా!' అని అన్నారు గర్గాచార్యుల వారు 'సాధు-సాధు' అన్నారు.

సత్యభామ లేచింది. 'మహాత్ములందరికీ నమస్సులు. నేను ఆ తోటి ఆడవారందరిని కలుసుకున్నాను. వారికి జీవితం మీద నిరాశ కలిగింది. చావురాక బ్రతికి ఉన్న దీనురాండ్రు వారు. వారికి జీవితంలో కావలసింది ఆదరణ-అండ, అభిమాన పూర్వకంగా, తల ఎత్తుకుని బ్రతుకకలిగే

అవకాశం, వారు కేవలం శ్రీకృష్ణ వాసుదేవ ప్రభువుల పాదాల ప్రాపును కోరుతున్నారు. వారందరూ శ్రీకృష్ణ పరాక్రమంతో విముక్తలైనవారు. శ్రీకృష్ణుల వారే వారందరికీ భర్త - ధర్త - ఆ పరాక్రమోపార్జితలు ఏ సుఖాన్నీ కోరడం లేదు. శ్రీకృష్ణుని పేర, శ్రీకృష్ణుని స్మరణతో, శ్రీకృష్ణ పదసేవ చేస్తూ బ్రతకాలని వారి కోరిక - శ్రీకృష్ణ ప్రభూ! మీరనుగ్రహించిన మేము ఎన మండుగురమూ, వీరందరినీ మాతోపాటు సమంగా చూచుకుంటాము. మీరే వారిని అనుగ్రహించాలి' అన్నది.

ప్రజలు ముక్తకంఠంతో సత్యభామను ప్రశంసించారు. రుక్మిణి, మిగతా కృష్ణుని భార్యలు అవునని తలలూపారు.

ఉపమన్యుల వారికి, గర్గాచార్యుల వారికి సత్యభామ మాటలు శ్రుతి వాక్కులుగా విన్పించాయి. ఎప్పుడు ఏర్పాటు చేశారో సత్యభామ ప్రేరణతో రెండు రోజులలో యాదవ కులాంగనలు పదహారు వేల నూరు తులసీ మాలలను కృష్ణ రూపాంకితాలుగా సిద్ధం చేశారు. వాటిని ఒక పెద్ద బంగారుపళ్ళెంలో తెప్పించారు. హెూమాగ్ని ముందు ఆ పళ్ళెరాన్నించారు.

గర్గుడు 'కృష్ణా! సృష్టిలో అభూతమైన ఆర్తోద్ధరణ కార్యక్రమం ఇది. నీవు నిర్లిప్తుడవు, యోగేశ్వరుడవు, అస్ఖలితశీలుడివి. ఇది నిమిత్తమే. కానీ నీవొక్కడివే పురుషుడవు. మేమందరం ప్రకృతులమే కదా! కానీ నాయనా! ఇలా వారి జీవనం పండింది. నీ అనురాగాన్ని పొందగలిగారు'.


శ్రీకృష్ణుని చేయి పట్టుకొని ఉపమన్యుడు యజ్ఞవేదిక వద్దకు నడిపించాడు. యజ్ఞవేదిక చుట్టూ ఏడడుగులు వేయించాడు. అతని చేతిలో ఆ పళ్ళెరంలోని తులసిమాలలను స్పర్శింపచేశాడు. వెంటనే సత్యభామ, రుక్మిణిలతోపాటు వందమంది యాదవ కులాంగనలు లేచారు.

శ్రీకృష్ణుడు గొంతెత్తి 'దేవకీ వసుదేవ గర్భ సంజాతుణ్ణి' యశోదా నందుల పోషితుణ్ణి శ్రీకృష్ణుణ్ణి ఈ పదారువేల నూరుమందిని స్వీకరిస్తున్నాను' అని ప్రకటించాడు.

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

శ్రీ చాంగ్‌దేవ్ మహా ప్రసిద్ధ, తయాచ్యామఠీ!
రాహే అ సాంగే శోభేకా, కేశరా సవాచీ ఉ టీ !
గణూ మ్హాణే జేథ్ అస్సల్ ! తేథే నక్కల్ ఫజిత్ పావేల్ !
మ్హణున్ జా దూరీ! నకో వర్క్ సరాఫా ఘరీ ॥

(భావం : మహా సిద్ధుడైన చాంగ్‌దేవ్ మహారాజ్ మఠంలో ఇటువంటి మెరుగులు అవసరమా? దాసగణు అంటున్నాడు ఎక్కడ అసలు ఉంటుందో అక్కడ నకిలీ దొరికిపోతుంది. అందువలన ఇక్కడ నుండి వెళ్ళిపో. బంగారం ఉన్న చోట బంగారుపూత అవసరం లేదు.

దాసగణు, రాధాకృష్ణా ఆయి యొక్క భిన్నమైన భక్తి వ్యక్తీకరణలు, ఆ వ్యక్తీకరణ కారణంగా భక్తులు రెండు వర్గాలు విడిపోయిన నేపథ్యంలో అసలు బాబా ఎటువంటి భక్తిని భక్తుల వద్ద నుండి ఆశించారు, ఏ విధమైన భక్తి వ్యక్తీకరణ ఆయనకు నచ్చుతుంది అనే అంశంపై మనం కొంచెం హేతుబద్ధమైన, వివరణాత్మకమైన వివేచన చేద్దాం!

వస్తుతః గుణ, ఆకార రహితుడైన భగవంతుని నుండి ఉద్భవించిన జీవులను మరలా ఆ భగవంతునిలో ఐక్యం చెందించడానికై ఆ భగవంతుడే స్వయంగా - దేశ, సాంఘిక, కాలమాన పరిస్థితులను బట్టి- వివిధ సద్గురు మూర్తుల రూపంలో అవతరిస్తారు. ఆ సద్గురు మూర్తుల బాహ్య రూపాలు భిన్నం కానీ, అంతర్ రూపం మాత్రం ఒక్కటే! వివిధ జీవుల యొక్క సంస్కారాల కనుగుణంగా, వారు వివిధ సద్గురు మూర్తులకు కేటాయించబడతారు. అలా కేటాయించబడిన భక్తుల ఉద్ధరణ గావించే బాధ్యత ఆ సద్గురు మూర్తుల భుజస్కంధాలపై ఉంటుంది. ఈ సత్యం వెలుగులో పరికిస్తే "అల్లా నాకు అప్పగించిన పైసలను, తిరిగి

నేను అల్లాకు అప్పగించాలి" అనే బాబా మాటలలోని అంతరార్థం మనకు స్పష్టంగా అవగతమవుతుంది. తమ భక్తుల యొక్క పారిమార్థిక పురోగతిని గావించే ప్రక్రియలో బాబా ఎలా నిరంతరం నిమగ్నమైయుంటారో ఇప్పటి దాకా మనం చేసిన దాసగణు చరిత్ర వివేచన ద్వారా మనకు బోధ పడుతుంది. తమ అవతారానికి కారణమైన భక్తుల పారమార్థిక పురోగతినే ఆ సద్గురు మూర్తి భక్తుల నుండి ఆశిస్తారు అని మనం ఈ చరిత్రలో ముందర చెప్పకున్నాం! ఆ పారమార్థిక పురోగతిని గావించే - భక్తుల నుండి జరిగే - ప్రతి వ్యక్తీకరణ ఆ సద్గురువుకి ప్రీతి కలిగించే పూజా ఉపకరణమే! వారి పట్ల ప్రదర్శించే భక్తి పరాయణమే!

"హృదయంలో వసించే భగవత్ తత్వంతో అనుసంధానం చెందడం కోసం చేసే ప్రతి ప్రయత్నం భక్తి యొక్క వ్యక్తీకరణయే! అటువంటి భక్తి వ్యక్తీకరణకు భగవంతుని ఆమోదం ఉంటుంది" అని మహాత్ములు ఉద్బోధిస్తారు. "**అడ్డుగోడ పడగొడితే చాలు**" అనే బాబా మాటలలో, "**వెలియ ఏమి లేదు. అంతా లోపలే ఉంది. అదేమిటో తెలుసుకునేందుకు ప్రయత్నించు**" అనే భగవాన్ రమణ మహర్షి మాటలలో ఈ సత్యమే దాగియుంది. అంతేకాదు, "**నీ శరీరంలో భగవంతుని వెదకు, అక్కడ నీకు భగవంతుని వెలుగు కనపడుతుంది**" అని కబీరు బోధిస్తుంటే "**భగవంతుని కృపాదృష్టిని పొందడానికి, నేను నా కళ్ళను లోపలికి మళ్ళించాను**" అని మీరాబాయి తన స్వానుభవాన్ని చెపుతుంది. అంటే, "మనం వెదకే దేవుడు మన హృదయవాసియై యున్నాడు" అని సత్యద్రష్టలైన మహాత్ములు నొక్కివక్కాణిస్తున్నారు. శరీరాన్ని ఉద్దేశించి "**టెంపుల్ ఆఫ్ గాడ్**" అనే క్రీస్తుమాటలలోని అర్థం అదే! ఆ దృష్ట్యా, సర్వానికి మూలవిరాట్టు అయిన ఆ భగవంతుడు హృదయవాసియై యున్నందు వలన, ప్రతి దేహం కూడా ఒక దేవాలయమే! ఆ దేహమనే దేవాలయపు గర్భగుడిలో (హృదయంలో) నున్న భగవంతుని దర్శించాలంటే, మొదట మనచక్షువులు అంతర్ముఖం కావాలి.

అపూర్వమైన ఆధ్యాత్మిక సత్యాలను తమదైన నిగూఢ శైలిలో భక్తులకు బోధించే బాబా, తాము ఇంకొందరు స్నేహితులతో కలిసి అడవిలో తిరిగే





కథలో అద్భుతమైన ఈ సత్యాన్నే విశదపరచారు. గురువు తమను బావిలో తలక్రిందులుగా వేలాడదీసినప్పుడు అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవించాము అని చెప్పడంలో "మనసు చేసే మాయను, ఆ మాయ నుండి మనలను గురువు రక్షించే రీతిని" ఆవిష్కరించారు. ఆకలిగొన్న ప్రాణి సహజసిద్ధంగా ఆహారాన్ని అన్వేషించినట్లుగా, మనిషి స్వభావ సిద్ధంగా ఆనందాన్ని సదా సొంతం చేసుకోవాలని అన్వేషిస్తుంటాడు. కానీ, తాను వెదకుతున్న ఆనందం ఏమిటో, ఎక్కడ లభిస్తుందో స్పష్టత ఉండదు. ఆ అస్పష్టతను అవకాశంగా తీసుకొని మనసు మర్కటమై ఆడుతుంది. మాయల దెయ్యమై మభ్యపెడుతుంది. మర్రి ఊడలా చుట్టుకొని ఉచ్చు బిగిస్తుంది. "అందరూ ఆనందాన్ని బయట వెదుకుతుంటే నువ్వేమిటి ప్రత్యేకంగా?" అని అడ్డుకుంటుంది. ఆనందం అంతా బయటే ఉంటుంది అని ఊరిస్తుంది. అందరితో కలసి నడవమని మారాం చేస్తుంది. ఆనందాన్ని బయట అందరితోపాటుగా వెతుక్కోమంటుంది. అశాశ్వతమైన ఆనందాల్ని శాశ్వతమైన ఆనందాలుగా భ్రమింపజేస్తుంది. కానీ, యోగ్యమైన వేళ ఆ భగవంతుడే తమ అనుగ్రహాన్ని పరోక్షంగా అందించి - అడవిలో భగవంతుడు కడజాతి వాని రూపంలో బాబాకు (కథలో బాబా "తాము" అని చెప్పిన పాత్రకు) అనుగ్రహమనే భోజనం పెట్టి, గురువును దర్శింప జేసిన విధంగా - తామే సద్గురువు రూపంలో ప్రత్యక్షంగా దర్శనమిస్తారు. అప్పుడు ఆ సద్గురువు తమదైన శైలిలో "వాస్తవం పూర్తిగా విరుద్ధమైనదని, ఆ దివ్యమైన అజరామరమైన ఆనందాన్ని మనం బయట వెదుకుతుంటే, ఆ ఆనందమేమో పూర్తి వ్యతిరేక దిశలో అంటే హృదయపు అట్టడుగు పొరలలో కేంద్రీకృతమై ఉంటుందని, కనుక తామసిక మృతిని తొలగించి, శాశ్వతమైన ఆత్మ ధ్యుతిని కలిగించే సచ్చిదానందమనే ఆ దివ్యజ్యోతి దర్శనం జరగాలంటే మనం మనసు చూపించే దిశకు 180 డిగ్రీల వ్యతిరేక దిశలో హృదయం లోనికి - బాబా మాటలలో చెప్పాలంటే తల క్రిందులుగా బావి లోనికి - చూడటం ప్రారంభించాలనే అనుభవజ్ఞానాన్ని" ప్రసాదిస్తారు. **(సశేషం)**

# అశ్రుతర్పణం



ఓ గొప్ప సాయిభక్తులు సాయికరుణతో తడిసిన జీవితం గడిపి తన వినయము, ప్రేమ అన్నదే అందరికీ మార్గదర్శకాలుగా నిలిపి తమ ఉద్యోగ రంగంలో (వాయుసేనలో) ఎన్నో ప్రశంసా పత్రాలు, అందరి మన్ననలు పొంది, సాయిధామం, సాయీ సేవా సమితి కార్యక్రమాలలో విశేష సేవలు అందించి మెల్లగా తరలి వెళ్ళిపోయారు గౌరవనీయులు, వింగ్ కమాండర్ శ్రీ భేరి సోమన్నగారు.

సాయివాణి పత్రికా నిర్వహణలో, పరిసర గ్రామాల్లో బాల సత్సంగాలు, సాయి విద్యాధామం పాఠశాలలో, యువతీ యువకులకు మార్గదర్శనంలో ఎన్నో సేవలు అందించిన శ్రీ భేరి సోమన్న గారు నవంబర్ 8, 2022నాడు సాయిలో ఐక్యమైనారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది సాయిధామం సేవాశ్రమం.





# మాతృసంస్థ కబుర్లు

దసరా పండుగ హిందువులకు చాలా పవిత్రమైనది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు. పదవ రోజు విజయదశమి (దసరా) అంటారు. విజయదశమి రోజున రాముడు రావణునిపై గెలిచిన సందర్భమున రావణ వధ అని, పాండవులు వనవాసమునకు వెళుతూ జమ్మిచెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు. జమ్మిచెట్టు పూజ చేయడం హిందువుల ఆచారం.

సాయిధామం ఆశ్రమంలో దసరా పండుగ ఆనందోత్సాహాలతో గడిచింది. పండుగకి వారం ముందు ఆర్.ఎస్.ఎస్. క్యాంపు 300 మంది పిల్లలతో సందడిగా పండుగ వాతావరణం నెలకొంది. దసరా రోజు ఉదయం ద్వారవతి సాయి దేవాలయంలో కాకడ హారతి, 6 గం.లకు సాయినాథుల వారికి క్షీర, జలాభిషేకాలు 8 గం.లకి ప్రత్యేక అలంకరణ అష్టోత్తర శత నామ పూజ, వాహనాల పూజ, అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామానంద ప్రభుజీ వారు ఆశ్రమ వాసులందరికీ నూతన వస్త్రాలు అందజేశారు. సాయంత్రం 7 గం.లకు జమ్మి పూజ, అనంతరం పూజ్య గురుదేవులు దసరా పండుగ గురించి ఉపన్యసించారు.

దసరా మరునాడు సాయినాథుల వారి మహాసమాధి ఉత్సవం, సమాధి ప్రత్యేక అలంకరణ, పాదుకా పూజ, దీపాలంకరణ బాబా సమాధి చెందిన ఘట్టం పారాయణ జరిగాయి. అక్టోబర్ 19వ తేదీ శ్రీ బాలాజీ స్వీటు షాపు వారి ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ వారు బాలాజీ స్వీటు షాపును ప్రారంభించి ఆశీస్సులు అందించారు.

అక్టోబర్ 22వ తేదీ పూజ్య శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ మహరాజ్ వారి 42వ జన్మదిన వేడుకలు ఎంతో భక్తిప్రపత్తులతో జరిగి

నాయి. ఆశ్రమవాసులు, భక్తులు జన్మదిన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జనులకు సద్ధర్మమార్గాన్ని చూపించడానికి, పరమాత్మను సర్వజీవుల లోనూ చూడగలవాడే యోగ్యభక్తుడని అటువంటివాడే లోకసేవ చేయగల డని మనకు కనువిప్ప కలిగించడానికి ఈ లోకంలో మళ్లీ మళ్లీ అవత రించే భగవత్ స్వరూపులే యోగులు.

ఇలాంటి యోగుల నీడ వారి ఆశీస్సులు మన మీద ఉండటం మనం చేసుకున్న పూర్వజన్మ పుణ్యం. వారి ఆశయాలలో నడవటమే మనం వారికిచ్చే గొప్ప బహుమతి.

“ఎవరు అదృష్టవంతులో వారు నా పూజ చేసుకుంటారు” అని బాబా వారు చెప్పారు కదా.

గం.6.30 ని.లకు పూజ్య గురుదేవుల అనుష్ఠానం అనంతరం గం.7.00 లకు “గురు పాదుకాపూజ బ్రహ్మశ్రీ త్రిగుళ్ల మాధవశర్మగారి ఆధ్వర్యంలో ఎంతో భక్తిప్రపత్తులతో జరిగింది. అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామానంద ప్రభుజీ వారికి ఫల, పుష్ప, వస్తు, వస్త్రాలను నివేదించి ఆశీస్సులు అందు కున్నారు భక్తులు. గం.10.00లకు దీపోత్సవం, దీపం జ్ఞానానికి గుర్తు. వారిలో ఉన్న జ్ఞానతేజస్సు అందరికీ ప్రసరించాలనీ 42 సంవత్సరాలు నిండిన సందర్భంగా 42 దీపాలతో పుష్పాలతో దీపోత్సవం శోభాయ మానంగా జరిగింది.

పాఠశాల విద్యార్థులు నృత్యరూపకంతో గురువందనం చేసారు. విచ్చేసిన భక్తులు స్వామీజీ వారితో వారికి ఉన్న అనుబంధాన్ని, వారు పొందిన మేలును, వారిలో ఉన్న శక్తిని వివరించారు. పాఠశాల విద్యార్థులు స్వామి శ్రీ రామానంద ప్రభుజీ వారిపైన కవితలు, వ్యాసాలు వ్రాసి అందరికీ వినిపించారు. అనంతరం చి.రేణుకానందన సాయి, శ్రీ నర్సింహగారు కలిసి తయారుచేసిన ఒక వీడియో క్లిప్‌ను ప్రొజెక్టర్ ద్వారా అందరికీ





చూపించారు. ఆ పాటకి స్వామీజీగారి ఆలోచనలకి సరిగ్గా సరిపోవడంతో విచ్చేసిన భక్తులందరి కళ్లు చెమ్మగిల్లాయి.

అటుపైన పూజ్య స్వామీజీ యిలా ప్రవచించారు. 84 లక్షల జన్మల తర్వాత వచ్చే ఈ మానవజన్మని సార్థకం చేసుకోవాలి. భగవంతుడు ఎవ్వరికీ ఇవ్వని వివేకాన్ని మనిషికి మాత్రమే ఇచ్చాడు. ఉన్నతంగా బ్రతకాలి, ఈ రోజు మీరందరూ నాకు గుర్తు చేసారు స్వామీజీ మీకు 42 ఏళ్ళు నిండాయి. మీరు ఇంకా సాధించవలసింది చాలా ఉంది సాధనలో. ఇంకా తీవ్రతరం చేసుకోవాలని గుర్తు చేసారు అని వివరించారు. మీరందరూ చూపించే ప్రేమాభిమానాలకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రేమాభిమానాలు వ్యక్తిపైన కాదు, వ్యవస్థ పైన .... ఈ ఆశ్రమాన్ని అన్ని చేతులతో కాపాడుకోవలసిన బాధ్యత మనందరిది. స్వామీజీ అంటే అభిమానం కాని వారు చెప్పింది చెయ్యము అంటే దానిని అభిమానం అనము కదా, నేను ఎంచుకున్న మార్గానికీ మీ అందరి సహాయ సహకారాలు అందిస్తారని ఆశిస్తున్నాను అందరికీ ఆశీస్సులు అని ముగించారు.

మనలోని భావాలను అక్షరరూపం చేయగలిగే శక్తి ఒక్క కలానికే ఉన్నది. పాఠశాల విద్యార్థులందరూ భవిష్యత్తులో వారు సాధించే విజయా లకు ఈ కలమే ఆధారం. కావున స్వామి శ్రీ రామానంద ప్రభుజీ వారు విద్యార్థులందరికీ కలము, పండు అందరికీ ఇచ్చి ఆశీస్సులు అందించారు. అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ జరుగగా, విద్యార్థులకు పులిహోర, స్వీటు అందించడం జరిగింది.

అక్టోబర్ 24వ తేదీ దీపావళి. భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలు నరకాసురుడనే రాక్షసుని సంహ రించిన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి జరుపుకుంటారు చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా

విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటాము. దీపాల పండుగ ముందురోజు ఆశ్వయుజ బహుళ చతుర్థి దీన్ని నరక చతుర్ధశిగా జరుపుకుంటారు.

ఈ సంవత్సరం దీపావళి రోజు గ్రహణం ఉండటంతో ముందురోజే అంటే 24వ తేదీనే దీపావళి జరుపుకోవలసి వచ్చింది. సాయిధామం సేవాశ్రమంలో దీపావళి పండుగ ఆనందోత్సాహాలతో జరిగింది. రెండు రోజుల ముందే ఆశ్రమ పరిసరాలన్నీ శుభ్రపరిచడం, పూలాలంకరణ పూర్తయినాయి. దీపావళి రోజు ఉదయాన్నే శ్రీ సాయినాథుల వారికి అభిషేకం, అలంకరణ, సహస్ర నామార్చన జరిగాయి. సాయంత్రం గం.6.00లకు ఆశ్రమం, దేవాలయం అన్నీ విభాగాలు రంగవల్లులతో, దీపాలంకరణతో వెలుగొందింది. గం.7.00లకు సాయిదత్త పీఠాధిపతులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి పరమ గురువుల అయిన వారి తండ్రిగారి తిథి కావడంతో వారికి పూజ, లక్ష్మీదేవి పూజ అనంతరం పిల్లలందరూ ఎప్పడెప్పడా అని ఎదురుచూస్తే టపాకాయలు కాల్చడం మొదలుపెట్టారు. వారి ముఖాలలో ఆనందాన్ని వర్ణించలేం. అనంతరం పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ వారు దీపావళి పండుగ విశిష్టతను గురించి అనుగ్రహ భాషణం చేసారు. అటుపైన పేణీ ప్రసాదం స్వీకరించారు అందరూ. కార్తీక మాసం అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది సాయిధామం ఆశ్రమం. ప్రశాంతమైన వాతావరణం, పచ్చని ప్రకృతి, పక్షుల కిలకిలా రావాలు, మనిషి మనసుని పులకింపజేస్తుంది. అందువల్ల దూరతీరాల నుండి కార్తీక మాసంలో వనభోజనాలకు వందల మంది విచ్చేస్తారు. నవంబర్ 13వ తేదీ ఆదివారం కావడంతో వనభోజనాలకు 300 మందిదాకా సాయిధామానికి విచ్చేసారు. ఆశ్రమ వాతావరణం అంతా పండుగలాగా అనిపించింది. భోగారం, బన్సీగూడ, కీసర మొదలైన గ్రామాల నుంచి విచ్చేసారు. శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ ఆధ్వర్యంలో సకల దేవతా స్వరూపమైన గోమాత పూజను





చేయించుకుని మన ఆచార సంప్రదాయాలను తెలుసుకున్నారు.

మధ్యాహ్నం గం.3.00లకు స్వామీజీ వారిని వనభోజనాల గురించి ఉపన్యసించవలసిందిగా భక్తులు కోరగా ఆశ్రమ పరిచయాన్ని, ఆశ్రమ కార్యక్రమాలను వివరించి, మనం అందరం కలసికట్టుగా చేస్తే దానిలో ఎంతో బలం దాగి ఉంటుందని వివరించారు. ఒకరి అనుభవాలు మరొకరు పంచుకోవచ్చు. ఆత్మీయతలు పెరుగుతాయి అని వివరించారు.

## సాయి తత్వ ప్రచారంలో మీరూను .....

శ్రీ సాయీ తత్వ ప్రచారానికై లక్షింపబడిన మాసపత్రిక “సచ్చిదానంద సద్గురు సాయివాణి” ఈ పత్రికకు చందాదారులుగా చేరండి. మీ మిత్రులను, సాయి బంధువులను చందాదారులుగా చేర్పించండి. బంధు మిత్రుల వివాహాది శుభ సందర్భాలలో ‘సాయివాణి’ ఆ జీవన సభ్యత్వం కానుకగా అందించండి. సాయివాణిని చదవండి, చదివించండి, అందులో చెప్పబడిన పెద్దల మాటలను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించండి. రెండు సంవత్సరాలకు రూ.200/- ఆజీవ సభ్యత్వం రూ.1000/- (చందా రెన్యువల్ తిరిగి చెల్లించువారు) చేయువారు సాయిధామం ఆశ్రమ చిరునామాకు (మొదటి పేజీలో కలదు). మనియార్డరు ద్వారా గానీ, చెక్కు, డ్రాఫ్ట్ ద్వారా గాని పంపించగలరు. దానిలో మీ అడ్రస్ స్పష్టంగా పిన్‌కోడ్‌తోసహా వ్రాయగలరు.

అడ్రసు మారినవారు మీ క్రొత్త అడ్రస్‌తోపాటు మీకు ఇవ్వబడిన సాయివాణి కోడ్ నెంబరును తెలియపరచవలెను.

సాయిధామంలో నడుస్తున్న సేవా కార్యక్రమాలకు ఆర్థికరూపంలో గానీ, వస్తురూపంలోగానీ, శ్రమ సేవారూపంగాకానీ మీకు చేతనైనంత వరకు తోడ్పడండి. 80జి పన్ను మినహాయింపు కలదు.

శ్రీ సాయితత్వ ప్రచార సత్కార్యంలో మీరూ పాలుపంచుకోండి మీ జీవితాలను ధన్యం చేసుకోండి.

# ఋభువు-నిదాఘుడు

- 'రమణాశ్రమ లేఖలు' నుండి

భగవాన్ అష్టావక్ర జనకుల కథ సెలవిస్తుంటే విన్న ఆంధ్రులొకరు ఈ ఉదయం శ్రీవారిని సమీపించి "నిన్న భగవాన్ అష్టావక్ర జనకుల సంవాదం సెలవిస్తూ ఋభుగీతను గురించి ప్రస్తావించారే, ఆ గీత ఏర్పడిన కారణం ఏమిటో?" అన్నారు.

"అదా! ఋభు మహర్షి నిదాఘునికి చేసిన తత్త్వోపదేశమే ఋభుగీత" అన్నారు భగవాన్.

"ఋభువు, నిదాఘుడిని పరీక్షించిన కథ గూడా భగవాన్ సెలవిస్తే వినాలన్న కుతూహలం కలుగుతున్నదే" అన్నారా భక్తులు.

భగవాన్ చిరునవ్వుతో ఈ విధంగా సెలవిచ్చారు.

ఋభువును ఆశ్రయించుకొని ఎందరో శిష్యులున్నప్పటికీ, శాస్త్రములలో ఆరితేరిన బుద్ధిశాలియు, పవిత్ర మానసుడును, గురుభక్తి తత్పరుడును అయిన నిదాఘుని మీద వారికి అత్యంత వాత్సల్యం ఏర్పడింది. అద్వైత తత్త్వం అతనికి ఎంతో విశదంగా బోధించారు. అయినప్పటికీ అతని మనస్సు, సంప్రదాయానుసారమైన కర్మకాండ నుండి విడుదల చెందనందువల్ల గురూపదిష్ట మార్గంలో నిలకడ కలుగలేదు.

అందువల్ల కర్మకాండ ననుసరిస్తూ, జన్మస్థానమైన ఒక పట్టణంలో ఉంటూ వచ్చాడు. అట్లా ఉంటూ ఉన్నప్పటికీ, మనసులో మాత్రం గురుభక్తి దినదినాభివృద్ధి చెందుతూనే ఉన్నది.

"యద్భావం తద్భవతి" అన్నట్లు శిష్యునికి గురుభక్తి ఏ విధంగా అభివృద్ధి చెందుతున్నదో, అదే విధంగా గురువునకు కూడా శిష్యుని యందు వాత్సల్యం వృద్ధి కాజొచ్చింది.

అందువల్ల కర్మకాండ నుండి ఏమాత్రం విడివడుతున్నాడో చూద్దామన్న





తలంపుతో, అప్పుడప్పుడూ ఋభువు, నిదాఘుని వద్దకు వెళ్ళి వస్తూ ఉండేవారు. ఒక్కొక్కసారి మారువేషంతో కూడా వెళ్ళేవారు.

అట్లా మారువేషంతో వెళ్ళిన ఒక సమయంలో, నిదాఘుడు రాజభవనం నుండి ఉత్సవంతో బయలుదేరే రాజును చూస్తూ నిలబడి ఉండడం, పల్లెటూరి మోటు ఆసామి వేషంలో వచ్చిన ఋభువు చూచాడు. నిదాఘుడు మాత్రం ఈ మనిషిని చూడలేదు.

మోటు వేషంతో వచ్చిన ఈ ఋభువు, నిదాఘుని పరీక్షించదలచి "ఇదేమయ్యా, ఈ గుంపులూ, కేకలూను" అన్నాడు.

నిదాఘుడు ఆ మనిషిని చూడకుండానే, మాట మాత్రం విని "రాజు ఊరేగింపుకు వెడుతున్నా"డన్నాడు.

ఋ : ఓహో! రాజు ఊరేగేందుకు పోతున్నాడా? ఎవరు రాజు?

ని : అడుగో, ఏనుగు మీద ఉన్నాడే, అతడే రాజు.

ఋ : ఆఁ! ఏమిటి? రాజు ఏనుగు మీద ఉన్నాడనా అంటున్నావు, సరే. అయితే, నేను రెండింటినీ చూస్తున్నాను. ఇందులో రాజెవడు? ఏనుగేది?

ని : అదేమయ్యా! నీవు రెండింటిని చూస్తున్నావు గదా, పైన ఉన్నవాడు రాజనీ; క్రింద ఉన్నది ఏనుగని తెలియదా?

ఋ : ఆఁ! ఏమిటేమిటి? సరిగా చెప్పవయ్యా బాబూ!

ని : అబ్బబ్బ! నీవంటి మనిషితో మాట్లాడటమే కష్టం. ఎన్నిసార్లు చెప్పేది? సరిగా విను. పైన ఉన్నది రాజు, క్రింద ఉన్నది ఏనుగు. ఇప్పుడైన తెలిసిందా? లేదా?

ఋ : అయ్యయ్యో! నావంటి మూఢుల మీద ఆగ్రహించకు బాబూ నిన్ను వేడుకుంటాను. ఇంకొక మాట - పైన క్రింద అంటావే, దానికి అర్థమేమిటో కాస్త చెప్ప నాయనా.

ని : (కోపంతో) సరిపోయింది. పైన రాజును, క్రింద ఏనుగును

చూస్తూనే ఉన్నావు. అట్లా ఉండిన్నీ పైన క్రింద అంటే యేమో తెలియదంటావేమి?

ఋ : ఆ! .... ఆ! ... అవునయ్యో. రెంటినీ చూస్తున్నాను. అందులో పైన యేమి? క్రింద యేమి?

ని : (కోపం ఆగక) ఉస్సో ... అబ్బబ్బ ... నీవు చూచిన దృశ్యాలు, విన్న వార్తలది, ఈ మాత్రం అర్థం కాకుంటే ఆచరణ రూపకంగానే బోధించాలన్న మాట. అయితే వంగు. అంతా నీకే పూర్ణంగా అర్థమవుతుంది.

నిదాఘుడు చెప్పినట్లే వంగాడా పల్లెటూరి ఆసామి.

నిదాఘుడు వెంటనే అతని వీపు మీద ఎక్కి కూర్చుని "ఆ! ఇదుగో, ఇప్పుడు తెలిసిందా? పైన నేను రాజువలె ఉన్నాను. క్రింద నీవు ఏనుగు వలె ఉన్నావు, సరేనా, బాగా అర్థమయిందా" అన్నాడు.

ఋ : ఊహూ, తెలియలేదే - ఇంకా బాగా అర్థం కాలేదు. నీవు రాజు వలె పైన ఉన్నావని, నేను ఏనుగువలె క్రింద ఉన్నాననీ అంటున్నావు. రాజు పైన, ఏనుగు క్రింద - అంతవరకు అర్థమవుతున్నది. "నేను, నీవు" అని అన్నావే అది మాత్రం అర్థం కాలేదు. దేని నుద్దేశించి "నేను, నీవు, అంటావు? ఆ విషయం కొంచెం వివరంగా చెప్ప బాబూ" అని బహు నిదానంగా ప్రశ్నించాడు.

ఈ విధంగా 'నేను, నీవు' అను దానిని విడిచి, 'తాను' అను పదాన్ని వివరించేదైన ఈ ప్రశ్న తటాలున తన యెదుట తోచినందువల్ల నిదాఘునకు తెలివి కలిగి, తక్షణం క్రిందకు దూకి, ఆ పల్లెటూరి మనిషి పాదాల మీద వ్రాలి -

"పూజ్యపాదుడైన నా గురువు ఋభువు తప్ప, బాహ్యమైన ఈ భౌతిక వ్యవస్థ నుండి విడివడి యథార్థ వస్తువైన ఆత్మయందు నిశ్చయబుద్ధి ఏర్పడునట్లు, నా మనస్సును ఆకర్షింపగలవారు వేరెవరున్నార"ని





నిశ్చయించి అంజలి హస్తుడై నిలిచి, తనకప్పుడు కలిగిన ఆత్మానుభూతిని గురించి వారికి వివరించి, ఆ నిశ్చయ జ్ఞానలబ్ధికై తన గురువును అనేక విధముల ప్రార్థించాడు.

ఈ ఋభువున్నూ స్వరూప వర్ణన చేస్తూ, అందులో అతనికి దృఢ నిశ్చయం ఏర్పడే విధంగా బోధించారు. ఈ బోధే 'ఋభుగీత'.

అందులో స్వస్వరూప వర్ణనే ఎక్కువగా ఉంటుందని సెలవిచ్చారు భగవాన్.

## నీతి పద్యం

**కమలములు నీట బాసిన**
**కమలాత్ముని రశ్మి సోకి కమలిన భంగిన్**
**తమతమ నెలవులు దప్పిన**
**తమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ!**

**భావం :** తామర పువ్వులకు బంధువు సూర్యుడు. సూర్యుని వెలుగులోనే అవి వికసిస్తాయి. అలాంటి తామరలు నీటి నుండి వేరైనప్పుడు అదే సూర్యరశ్మికి వాడిపోతాయి. అంటే ఎవరైనా తమతమ స్థానాల నుండి వైదొలగినప్పుడు తమ సన్నిహితులే శత్రువులు అవుతారు.

## నీతి శ్లోకం

**దీపం జ్యోతి పరబ్రహ్మ - దీపం సర్వ తమోపహమ్।**
**దీపేన సాధ్యతే సర్వం - సంధ్యా దీపం నమోస్తుతే॥**

**భావం :** మనం సాయంకాలం వెలగించే దీపము జ్యోతి స్వరూపమైనది. అదే పరబ్రహ్మము. ఈ దీపం మన చుట్టూ ఉన్న చీకటిని పారద్రోలుతుంది. అలాగే మన జీవితంలోని చీకట్లను పారద్రోలి వెలుగు నింపుతుంది.

- విజయలక్ష్మి మత్స్యరాజు

శ్రీ సాయిరాం

## పంచమ వార్షిక అష్టోత్తర శత కుండాత్మక ఏకాహ్నిక

# శ్రీ దత్త మహాయాగము

**సాయిధామం, పెద్ద పర్వతాపురం గ్రామం, యాదాద్రి భువనగిరి జిల్లా**

**తేది : 07.12.2022 బుధవారం వేదిక : సాయిధామం**

శ్రీ సాయినాథుడు ఒక విశిష్ట యోగీశ్వరుని రూపంలో కనిపించిన సంపూర్ణ దత్తావతారం. పరులను సేవించడంలోనే ముక్తిమార్గం ఉన్నదని ఆయన వాచా కర్మణా కూడా చెప్పారు. సమస్త జీవరాశులలోను నన్నే చూడండి అని ఆయన మనకు హితవు చెప్పారు. స్వయంగా తామే ఆబాల గోపాలాన్ని సేవిస్తూ గడిపారు. ఆయన భక్తులకు ఎవరికైనా ఆ విధానమే శిరోధార్యం. ఆ మార్గంలో ప్రయాణించిన శ్రీ సాయి దత్త పీఠాధిపతులు, సాయీ ప్రసన్నులు, శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్, సాయిధామం, శ్రీ సాయినాథ క్షేత్రం, శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం సేవాశ్రమాల వ్యవస్థాపకులు పరమపూజ్య గురుదేవులు **శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ మహారాజు** వారు. వారి దివ్య ఆశీస్సులతో, **శ్రీ మాతా శుకవాణీ** గారి ప్రేమాశీస్సులతో .... **శ్రీ సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ** వారి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ త్రిగుళ్ళ మాధవశర్మ వారి మిత్రబృంద పర్యవేక్షణలో లోక కళ్యాణార్థం భక్తాభీష్ట సిద్ధ్యర్థం నవగ్రహ దోష నివారణార్థం విజయ అభయ ఆయురారోగ్య ఫల సిద్ధ్యర్థం త్రిమూర్త్యాత్మక స్వరూపుడైన శ్రీ దత్తాత్రేయ స్వామి అవతరించిన రోజున దత్త జయంతి స్వస్తిశ్రీ శుభకృత్ నామ సంవత్సర మార్గశిర శుద్ధ పౌర్ణమి (దత్త జయంతి) **బుధవారం తేది: 07-12-2022**న మన సాయిధామంలో ఏకాహ్నిక దీక్షా విధానంతో అష్టోత్తర శత కుండాత్మక శ్రీ దత్త శక్తి మహాయాగము జరుపుటకు సంకల్పించబడినది. కావున భక్తులందరూ ఈ శ్రీ దత్త మహాయాగములో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరు.





## కార్యక్రమ వివరములు

**07-12-2022 బుధవారం**

ఉ.గం. 8.00ల నుండి శ్రీ విఘ్నేశ్వర పూజ, స్వస్తి వాచనము, అఖండ దీప స్థాపనము, శ్రీ గురు పూజ, గోపూజ.

ఉ.గం. 9.00 : శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి పంచామృత అభిషేకము, పూజ

ఉ.గం.10.00 : యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, శ్రీ గణపతి హోమము, నవగ్రహ హోమము, శ్రీ దత్తాత్రేయ మూల మంత్ర గాయత్రి హోమములు.

దత్త హోమం విశిష్టత గురించి

**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారి ప్రవచనం**

మ.గం.1.00 : **శ్రీశ్రీశ్రీ మాతా నిర్మలయోగి భారతి** గారి అనుగ్రహ భాషణం తదనంతరం పూర్ణాహుతి

మ.గం.2.00 : అన్నప్రసాద వినిమయం

ఈ యజ్ఞం కార్యక్రమంలో పాల్గొనే భక్తులు దక్షిణగా రూ.1,116/-లు సమర్పించవలసి ఉంటుంది. ఈ యజ్ఞ సామాగ్రి ఆశ్రమమే అంద జేస్తుంది. ఎవ్వరైనను యజ్ఞంలో పాల్గొనవచ్చును. యజ్ఞంలో పాల్గొనేవారు సాంప్రదాయ దుస్తులనే ధరించాలి. ఈ యజ్ఞం కార్యక్రమమునకు భక్తులు అధిక సంఖ్యలో మరియు సకాలమునకు విచ్చేయగలరు. యజ్ఞంలో పాల్గొనలేని వారు వారి పేరు, గోత్ర నామములను తెలియజేసిన యెడల వారి పేరిట కూడ యజ్ఞం నిర్వహించబడుతుంది. ఈ యజ్ఞ కార్యక్రమము నకు ధన, వస్తు రూపేణ సమర్పించి శ్రీ సాయిదత్త ప్రభు వారి కృపకు పాత్రులగుదురు గాక.

**వైదిక నిర్వహణ : బ్రహ్మశ్రీ త్రిగుళ్ళ మాధవశర్మ**

## అందరికీ ఇదే ఆహ్వానము

**ఇట్లు**

**సాయిధామం**

**వివరాలకు సంప్రదించండి : సెల్ నెం. 9440413455, 9848133565**